సూపర్ సిక్స్‌లో అన్నీ కోతలే




బనవాసిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు, విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ప్రజలు

- ఆరోగ్య శ్రీ రద్దు చేసి పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి
- పెద్దమరివీడు, బనవాసిలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ

గోనెగండ్ల : కూటమి ప్రభుత్వం అరకొరగా అమలు చేస్తున్న పథకాల్లో అన్ని కోతలే ఉన్నాయని, బాబుకు చిత్తశుద్ధి ఉంటే సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలన్నీ నిజంగా నేరవెర్చేవారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక అన్నారు. బుధవారం మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగానే క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. బుట్టా రేణుక మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 16నెలలు అయ్యిందని, సూపర్ సిక్స్ పథకాలను అరకొరగా అమలు చేసి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబుది సుపరిపాలన కాదని.. మోసాల పాలన అని ఎద్దేవ చేశారు. పింఛన్లలో కోతలు విధించి దివ్యాంగులకు అన్యాయం చేశారన్నారు. ఇప్పటి వరకు కొత్త పింఛన్ల మంజూరు ఊసే లేదన్నారు. ఎందరో అభాగ్యులకు ఆసరాగా ఉన్న ఆరోగ్య శ్రీని రద్దు చేసి పేదలతో చంద్రబాబు ఆడుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ప్రాణాలంటే బాబుకు లెక్కలేదని, ఎప్పుడు చూసిన కార్పొరేట్ వ్యవస్థను గూర్చి ఎక్కువగా ఆలోచన చేస్తారని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని తెలిపారు. వైఎస్ జగన్ హయాంలో పేద బడుగు, బలహీన వర్గాల వారందరికీ లబ్ధి చేకూరిందన్నారు. చంద్రబాబు ఏ పథకం ప్రారంభించిన సగం సగమే ఇస్తారని, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్, తల్లికి వందనం ఇలా అమలు చేసిన పథకాల్లో ప్రతి దాంట్లో సగమే ఇచ్చారని బుట్టా రేణుక విమర్శించారు.

లిక్కర్ స్కామ్‌లో మునిగిన కూటమి నేతలు..

సీనియర్ నాయకుడు మురహరి రెడ్డి మాట్లాడుతూ ఇటీవల వెలుగులోకి వచ్చిన లిక్కర్ స్కామ్‌లో కూటమి నేతలే ఉన్నారన్నారు. కూటమి నేతలు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా తమ స్వార్థ ప్రయోజనాల కోసం మద్యం కుంభకోణాల్లో మునిగిపోయారని మండిపడ్డారు. మొన్న పోలీసులకు పట్టుబడిన లిక్కర్ సరఫరా రాకెట్‌లో ఉన్న సంబంధాలు ఎక్కడికి దారి తీస్తున్నాయో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ, పార్టీ నాయకులు బందెనవాజ్, కాశీవిశ్వనాథ రెడ్డి, దొరబాబు, నజీర్ అహమ్మద్, చికెన్ రాజా, అల్లబకాష్, గంగాధర్, రంగారెడ్డి, జైపాల్, పెద్దమరివీడు నాయకులు నరసన్న ఆచారి, నాగేష్, ధనుంజయ్, కిష్టన్న గౌడ్, లోకేష్, దేవేంద్ర, వెంకన్న గౌడ్, గజేంద్ర గౌడ్, కరీం, దరగల రఫీ, సుభాన్, సురేష్ గౌడ్, తిమ్మప్ప, కేశన్న, రంగన్న, నబీ, మహబూబ్ బాషా, షేక్షావలి, పెద్దయ్య, లింగన్న, రామలింగప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడమే బాబు నైజం

ఎమ్మిగనూరుటౌన్: సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టడం, గద్దెనెక్కిన తరువాత వాటిని విస్మరించడం ఆయన నైజమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని బనవాసి గ్రామంలో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, నాయకులు బుట్టా శివనీలకంఠ, కేఆర్ మురహరిరెడ్డి, ఎంపీపీ కేశన్న, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు బసిరెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మిదేవి, గ్రామసీనియర్ నాయకుడు నల్లారెడ్డిలతో కలిసి క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయక చేసిన మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగనన్న ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లోని నవరత్నాలతో పాటు అనేక హామీల సంక్షేమ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గొల్ల రంగన్న, అంజప్ప, లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మండల నాయకుడు భీమిరెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నజీర్‌అహమ్మద్, కోటేకల్ సర్పంచ్ లక్ష్మన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టారంగయ్య, నాగభూషన్‌రెడ్డి, భాస్కర్, బజారి, పెద్దయ్య, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న బుట్టా రేణుక

క్లుప్తంగా

మాజీ ఎంపీటీసీకి పరామర్శ



శంకర్ రెడ్డిని పరామర్శిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ నాయకులు

గోనెగండ్ల : మండలంలోని పెద్దమరివీడు గ్రామ మాజీ ఎంపీటీసీ శంకర్ రెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక బుధవారం పెద్దమరివీడు గ్రామంలో శంకర్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, ఆయనకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ, మురహరి రెడ్డి, మండల కన్వీనర్ కేవీ కృష్ణా రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ఆదోని అర్బన్: ఆదోని రోటరీ క్లబ్ తుంగభద్ర జోన్–5 ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె, డయాబెటిస్ వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైఫుల్లా, కార్యదర్శి మేఘనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగులకు, కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సీనియర్ ఫిజీషియన్లు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సైఫుల్లా పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. వైద్య శిబిరంలో 168 మంది మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. వైద్యశిబిరం ప్రారంభోత్సవానికి మున్సిపల్ చైర్ పర్సన్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ హాజరయ్యారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు జీవన్‌సింగ్, క్లబ్ సభ్యులు సోమశేఖర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, భరత్‌షా, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుస్వామి మృతి



గురుస్వామి వీరేష్ ఆచారి (ఫైల్)

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని కింద మారెమ్మ దేవి ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న కె. వీరేష్ ఆచారి (41) అనే శివ గురుస్వామి అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఆయన 23 ఏళ్ల పాటు ప్రతిఏటా శివ మాల ధరించి గురుస్వామి మంచి పేరు సంపాదించుకున్నారు. ఆయనిది నిరుపేద కుటుంబ కావడంతో శివ మాల ధరించే బసవన్న కట్ట శిష్య బృందం చేయి చేయి కలిసి రూ.18వేలు పోగుచేసి చేయూత నందించారు. శిష్యులందరు ఆయన మృత దేహానికి పూల మాలలు వేసి సంతాపం తెలిపారు. నగదు మృతిని భార్య లక్ష్మీదేవికి అందజేశారు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న స్వచ్ఛంద సేవకుడు తిరుమల్

ఎమ్మిగనూరుటౌన్: రక్తదానం చేయడంతో ప్రాణాపయస్థితిలో వున్నవారి ప్రాణాలను కాపాడినట్లు అవుతుందని స్థానిక వివేకానంద స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు తిరుమల్ అన్నారు. నందవరం మండలంలోని కనకవీడు పేటకు చెందిన ఆర్మీ జవాన్ మనోహర్ 4వ వర్ధంతి సందర్భంగా తల్లిదండ్రులు, స్నేహితులు, ఆ గ్రామస్తుల సహకారంతో బుధవారం పట్టణంలోని మహాత్మాగాంధీ బ్లడ్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పలువురు రక్తదానం చేయగా వారికి ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు రాము, రవి, రమేష్, రామాంజినేయులు, తిరుమలేష్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని హెచ్‌ఎం బి.నర్సప్ప అన్నారు. మండల పరిధిలోని గుడికల్ గ్రామ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు 17 సంవత్సరాల విభాగంలో తాయన్న, బాలికల విభాగంలో బి.ఇందు, 14 సంవత్సరాల విభాగంలో సంపత్, పుష్ప 4వ తేదీన కర్నూలు జరిగిన స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం గ్రామంలోని పాఠశాల ఆవరణలో ఎంపికైన విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు బజారప్ప, ఎస్‌ఎండీ హనీఫ్, ఆనంద్‌లను అభినందించారు.

పొదుపు నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేయాలి

ఆదోని టౌన్: పట్టణం కుమ్మరి వీధికి చెందిన పొదుపు సంఘం సభ్యురాలు పొదుపు పేరుతో వేలాది రూపాయలు వసూలు చేసుకుని పలాయనం చిత్తగించిందని, బాధ్యురాలిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని పొదుపు మహిళలు బుధవారం ఐకేపీ మెప్మా ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓ) వీరారెడ్డి, బాషాలు కల్పించుకుని బాధ్యురాలిపై చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని భరోసా ఇచ్చినా.. మహిళలు శాంతించలేదు. తక్షణమే ఆర్పీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేశారు. పొదుపు పేరుతో తోటి మహిళలను మోసగించడం ఎంతవరకు సబబు అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

సీజేఐపై దాడిచేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి

ఎమ్మిగనూరుటౌన్: సుప్రీం కోర్ట్ సీజేఐ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని అవమానించారంటూ కిషోర్ రాకేష్ అనే న్యాయవాది ప్రధాన న్యాయమూర్తిపై చేసిన దాడిని తాము ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈదాడి భారత రాజ్యాంగంపై జరిగిందని, ఇలాంటి ముమ్మందు జరగకుండా పాలకులు చర్యలు తీసుకోవాలని కోరారు.

జీఎస్టీపై అవగాహన

మంత్రాలయం రూరల్ : కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో బుధవారం ఎంపీడీఓ నూర్జహాన్ ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన కల్పించారు. గతంలో నాలుగు స్లాబ్స్‌లో జీఎస్టీ ఉండగా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రెండు స్లాబ్‌లకు కుదించడం జరిగిందన్నారు. కుదింపు కారణంగా వాహనాలు, ఇంటి ఉపకరణాల ధరలు తగ్గినట్లు వివరించారు. అనంతరం విద్యార్థులకు కొత్త జీఎస్టీ విధానంపై ఎస్‌ఏ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో మొయినుద్దీన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వసతి నిలయం ప్రారంభం



వసతి నిలయాన్ని ప్రారంభిస్తున్న వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం : మండల కేంద్రంలోని పాతూరులో నూతనంగా నిర్మించిన శ్రీరాయరు భీమా రెసిడెన్సీని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. మండల వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర ఈ వసతి నిలయాన్ని నిర్మించుకున్నారు. బుధవారం ప్రదీప్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం, ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, ఉప సర్పంచు హోటల్ పరమేష్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్‌శెట్టి, నాయకులు జనార్దన్‌రెడ్డి, శివకుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నిధుల సమీకరణపై అవగాహనుండాలి



అవగాహన కల్పిస్తున్న మంత్రాలయం ఈఓ ఉపేంద్ర

మంత్రాలయం రూరల్ : పంచాయతీల్లో నిధుల సమీకరణపై ప్రతి సర్పంచు, కార్యదర్శికి అవగాహన ఉండాలని ఎంపీడీఓ నూర్జహాన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీఈఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో సమీక్ష చేపట్టారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో సాధారణ పన్నులతో పాటు పన్నేతర వనరులపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీ అనుమతులు, ధ్రువీకరణ పత్రాల మంజూరు ద్వారా పన్నులు సేకరించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ మల్లయ్య, ఈవో ఉపేంద్రరెడ్డి, టీవోటీలు స్వామినాథన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

- **పెద్దకడబూరు :** గ్రామ పంచాయతీల ద్వారా ఆదాయ వనరులు పెంపునకు కృషి చేయాలని పెద్దకడబూరు డిప్యూటీ ఎంపీడీఓ జయరాముడు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఓన్ సోర్స్ రెవెన్యూ అనే అంశంపై గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు రెండు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది.
- **నందవరం :** పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధికి ఆదాయ వనరులను సృష్టించుకోవాలని నందవరం ఈఓపీఆర్డీ సందీప్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు.

సీసీ రోడ్లు ఏర్పాటుకు సంతకాల సేకరణ

పెద్దకడబూరు : మండల కేంద్రంలో సీసీరోడ్లు వేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, సీనియర్ నాయకులు పరమేష్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ముఖ ద్వారము నుంచి కురువ వీధి గుండా పంచాయతీ కట్ట వరకు సీసీరోడ్లు వేసి డ్రైనేజీ సౌకర్యం కల్పించాలన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సిస్టం లేకపోవడంతో ఆ కాలనీ వాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడం దారుణమన్నారు. ఈ విషయంపై సోమవారం(13వ తేదీ)న తహసీల్దారు కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడుతామని, గ్రామప్రజలు, కాలనీవాసులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న, కాలనీ వాసులు పాల్గొన్నారు.

న్యూ గాంధీనగర్‌లో సమస్యలు పరిష్కరించాలి

ఆదోని రూరల్: పట్టణంలోని న్యూ గాంధీ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి జి.అంజిత్‌గౌడ్, పట్టణ సహాయ కార్యదర్శి కె.లింగప్ప అన్నారు. బుధవారం కాలనీవాసులతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేవన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలను కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్తే తాము మీ వార్డు కౌన్సిలర్ కాదని చేతులెత్తేస్తున్నారన్నారు. కాలనీలో ఓటర్లు మూడు పార్ట్‌లు విడిపోవడంతో సమస్య తలెత్తిందన్నారు. న్యూగాంధీనగర్ కాలనీని ఒకే వార్డులోకి చేర్చి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రమేష్‌కుమార్, ఏఐవైఎఫ్ నాయకులు వరప్రసాద్, ఇమ్మానియేల్, సుశీలమ్మ, కర్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

వెల్దుర్తి: స్థానిక 2వ వార్డు తెలుగు వీధిలో వెలసిన పెద్ద దస్తగిరి స్వామి ఉరుసు బుధవారం ఘనంగా జరిగింది. నిర్వాహకుడు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. గురువారం జియారత్‌లో భాగంగా కిస్తీ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

స్మార్ట్ దోపిడీపై విచారణ

సాక్షి ఎఫెక్ట్



కనకవీడులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పరిశీలిస్తున్న ఆర్‌ఐ రవీంద్రరెడ్డి

నందవరం : స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆర్‌ఐ రవీంద్రరెడ్డి హెచ్చరించారు. స్మార్ట్ కార్డులకు డబ్బులు వసూలు చేస్తుండటంపై బుధవారం సాక్షి దినపత్రికలో 'స్మార్ట్ దోపిడీ' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్‌ఐ స్పందించారు. బుధవారం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో స్మార్ట్ కార్డుల పంపిణీని పరిశీలించి, అక్రమాలపై లబ్ధిదారులతో విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు వీఆర్వోలు పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రవి పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపిక

పెద్దకడబూరు : ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో 9,10వ తేదీల్లో అండర్ –14, అండర్ –17 విభాగాలలో విద్యార్థులకు వివిధ క్రీడలలో మండల స్థాయి ఎంపిక నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి బి.రామమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 9న మండల పరిధిలోని హెచ్.మురవణి ఉన్నత పాఠశాలలో కబడ్డీ, కోకో, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్, డిస్కస్ త్రో క్రీడలలో ఎంపిక చేపట్టనున్నట్లు వివరించారు. అదేవిధంగా 10న మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాల(ఏపీ మోడల్ స్కూల్)లో యోగా, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, 100 మీటర్లు, 200, 400, 800, 1500 మీటర్లు, 3కిలో మీటర్ల పరుగు పందెం, జావెలిన్ త్రో వంటి క్రీడలలో ఎంపికలు జరుగుతాయన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థుల వివరాలను ఎస్‌జీఎఫ్ మండల కో–ఆర్డినేటర్ జేబీ కృష్ణకు సమాచారం అందించాలని సూచించారు.

మార్కెట్ యార్డులో సబ్సిడీ భోజనం ప్రారంభం

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతులకు సబ్సిడీ భోజనం బుధవారం ప్రారంభమయ్యింది. కార్యక్రమానికి ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మార్కెట్‌యార్డు చైర్మన్ జిందే శారద, వైస్ చైర్మన్ ఆదూరి విజయ్‌కృష్ణ, డైరెక్టర్లు పాల్గొని ప్రారంభించారు. ముందుగా రాధాకృష్ణలకు ప్రత్యేక పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి అనంతరం రైతులకు ఎమ్మెల్యే, యార్డు చైర్మన్, డైరెక్టర్లు, యార్డు సెక్రటరీ గోవిందులు భోజనం వడ్డించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు కేవలం రూ.15కే భోజనాన్ని అందజేయాలన్నారు. మిగిలిన మొత్తాన్ని యార్డు నుంచి రూ.20 మొత్తం రూ.35 చొప్పున ఇస్కాన్ వారికి అందజేస్తామన్నారు. యార్డు అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జీఎస్టీ 2.0పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ విజయరాణి బుధవారం బహుమతులు, ప్రసంశా పత్రాలను అందజేశారు. కళాశాలలో విద్యార్థులు వరుసగా మూడు బహుమతులను హన్షిక ప్రియదర్శిని, జి.దర్శిని, వాసవి, లతీఫా, నందిని, మనాస దక్కించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు లక్ష్మయ్య, రవిప్రభాస్, లక్ష్మీస్రవంతి, శ్రీనివాసులు,ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ హరికుమార్ పాల్గొన్నారు.

14న జాబ్‌మేళా

ఆదోని రూరల్: ఈనెల 14వ తేదీన ఆదోని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వైఎంకే స్కూల్ క్యాంపస్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబ్‌మేళాలో 11 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల్లోపు నిరుద్యోగ యువతీ, యువకులు (ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన) అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 91774 13642, 97039 93995 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆందోళన బాట



మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఎమ్మిగనూరుటౌన్: తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన బాట పట్టనున్నట్లు వార్డు సచివాలయ ఉద్యోగులు తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి, రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్‌లకు తమ ఆందోళన కార్యాచరణ ప్రణాళికపై వినతి పత్రాలను ఇచ్చారు. వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి రవికిరణ్, కోశాధికారి రజిని, ఆర్గనైజింగ్ కార్యదర్శి హంపిరెడ్డి, పబ్లిసిటి కార్యదర్శి ఆకిఫ్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

16వ వార్డులో సమస్యలను పరిష్కరించాలి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలోని 16వ వార్డు కొడల్‌పేట ప్రాంతంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కౌన్సిలర్ హసీనాబాను ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. రూ.28 లక్షలకు సంబంధించిన అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి పది నెలలు గడిచినా నేటికీ ఒక్క పని చేపట్టకపోవడం శోచనీయమన్నారు. మళ్లీ రూ.45 లక్షలకు టెండర్లు పిలిచి మూడు నెలలు గడిచినా టెండర్ల ప్రాతిపదికన నిలిచిపోయాయే తప్పా కార్యరూపం దాల్చలేదన్నారు. అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడంలేదని, అధికారుల పనితీరుకు నిరసనగా ఆందోళన చేశామన్నారు. రెండు, మూడు రోజుల్లోగా కొడల్‌పేటలో అభివృద్ధి పనులను ప్రారంభించని పక్షంలో ఆవుదొడ్డి వంక వాగులో నిరాహార దీక్ష చేస్తామని కౌన్సిలర్ హసీనాబాను, నాయకులు ఇబ్రహీం, కాలనీ వాసులు అధికారులను హెచ్చరించారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్సీ మధుసూదన్

వెల్దుర్తి: మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో వాల్మీకీ మహర్షి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. వాల్మీకి గ్రామ సంఘం నాయకులు రామచంద్రుడు, మద్దిలేటి, ఓబులేశు, నాగమద్ది, నాగేశు, నడిపి బద్దయ్య, తలారి దస్తగిరి తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ ఏ మధుసూదన్, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వలసల రామకృష్ణ, ఆలూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామ్‌భీమ్ నాయుడు, వాల్మీకీ జాతీయ కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రతిష్ఠోత్సవం, హోమ పూర్ణాహుతి, పూజల్లో పాల్గొన్నారు. నాయకులు, పీఠాధిపతులు రామళ్లకోట మాధవస్వామి, బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు, బలరాం గౌడ్, బోగోలు కమలాకర్ పాల్గొన్నారు.

బస్సుల కోసం అష్టకష్టాలు...!



బస్సు ఎక్కేందుకు గుమిగుడిన ప్రయాణికులు



బస్సు కిందపడుతూ తప్పించుకున్న ప్రయాణికులు

ఎమ్మిగనూరురూరల్: దసరా సెలవులు పూర్తి కావటంతో విద్యార్థులు, వివిధ పనుల మీద వేరే ఊర్లకు వెళ్లే ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్ బుధవారం కిటకిటలాడింది. ఇక్కడి నుంచి ఎక్కువగా ప్రయాణికులు కర్నూలు, ఆదోని, పత్తికొండ, గూడురు ప్రాంతాలకు వెళ్తున్నారు. సరైన బస్సు సర్వీసులు లేకపోవటంతో స్టాండ్‌లోకి బస్ రాకముందే ప్రయాణికులు పరుగులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి కర్నూలు ప్లాట్‌ఫాం వద్ద తన కుమార్తెను బస్సు ఎక్కించేందుకు బైక్‌పై తీసుకొచ్చి దించుతుండగా... కర్నూలు బస్సు రావటంతో ప్రయాణికులు బైక్ ఉన్నది కూడా చూడకుండా పరుగులు పెట్టడంతో ఓ వ్యక్తి ఢీకొన్నాడు.. అదే సమయంలో బస్సు బైక్‌ను తాకుతూ వెళ్లటంతో భయంతో అక్కడున్న విద్యార్థులు, ప్రయాణికులు కేకలు వేయడంతో అప్రమత్తమయ్యారు. బైకుపై ఉన్నవారు కిందపడటం, వారికి ఏమీ కాకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లేకపోయింటే బస్సు ముగ్గురు కిందపడేవారు. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల కోసం అదనపు బస్సు సర్వీసులు నడపటంతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.